క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉపాధ్యాయులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దేవినేని కిషోర్‌కుమార్ అన్నారు. అసోసియేషన్ వన్‌టౌన్ భవానీపురం శాఖ ఆధ్వర్యాన ఆదివారం రాయల్‌హోటల్ సెంటర్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చక్కని జీవనశైలిని కొనసాగిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ఆపిల్ డెంటల్ ఇంటర్నేషనల్, అయాన్ కంటి ఆసుపత్రి, అను న్యూరో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్య సిబ్బంది సేవలందించారు. కార్యక్రమానికి డివిజన్ అధ్యక్షులు డాక్టర్ రాజుడేవిడ్ దొంతులూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ, ఎకో పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి.. మహిళలకు ఆదర్శం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం పోరాట స్ఫూర్తి నేటి మహిళలకు ఆదర్శమని ఐద్వా పశ్చిమ నగర అధ్యక్షురాలు కె.శేషమణి పేర్కొన్నారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఏకలవ్యనగర్‌లో ఆదివారం సభ నిర్వహించారు. స్వరాజ్యం చిత్రపటానికి నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ స్వరాజ్యం 12 ఏళ్ల నుంచే ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, పేదల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. నేటి మహిళలు మల్లు స్వరాజ్యాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమాల్లో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, మాధవి, వీవీ లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో నేడు స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జరిగే స్పందనను వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించడానికి వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో అర్జీలు తీసుకుంటారని వివరించారు.

రౌడీషీటర్లు గొడవల్లో ఉంటే జైలుకే

సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్‌కే ఖాదర్‌బాషా

ఆటోనగర్(విజయవాడతూర్పు): గొడవలు సృష్టించడం... ఇందులో ప్రమేయం ఉంటే జైలుకు పంపిస్తామని విజయవాడ సెంట్రల్ జోన్ ఏసీపీ ఎస్‌కే ఖాదర్‌బాషా రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం ఫన్‌టైమ్స్ రోడ్డులోని ఏసీపీ కార్యాలయం ఆవరణలో రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు మంచిగా ఉండాలని, మీ ప్రవర్తన మార్చుకోవాలి లేకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గంజాయి అమ్మడం.. తాగడం లాంటివి చేయకూడదని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేయకూడదన్నారు. మీ ప్రాంతాల్లో ఏవైనా సంఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మీ పద్ధతి మార్చుకుంటే ఏడాది తర్వాత రౌడీషీట్‌లను తొలగిస్తామన్నారు. కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసుకోవాలని వారిని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సైలు జాన్‌బాషా, వల్లి పద్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: కళాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. శ్రీ సరస్వతీ కళాపీఠం, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకల సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ఆదివారం ఉగాది వేడుకలు, వివిధ జిల్లాలనుంచి వచ్చిన గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కారం, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాకారులు సాంస్కృతిక వారధులని వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. సీనియర్ గాయకుడు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో కొమ్మినేని రత్నకుమారి, చందన, వడ్డాది కామేశ్వరి, మాధవి, కొప్పరపు ఉమాబలరాం పలు చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. మధిర రోజా ప్రసన్న ఈల పాటతో అలరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కళాపీఠం వ్యవస్థాపకుడు పీసుపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



ఉపకార వేతనాలు అందిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో పేదలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరాల ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన ఆదివారం విద్యార్థులకు ఉపకారవేతనాలు, వృద్ధులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కొత్తపేట నగరాల సీతారామ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథి మేయర్ భాగ్యలక్ష్మి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాలకు పైగా నగరాల ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నగరాల సమాజానికి విస్తృతమైన సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు అండగా నిలిచే పలు కార్యక్రమాలను చేయటం పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు బాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ సంస్థ 23 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం, వృద్ధులకు అండగా ఉండాలనే లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పిళ్లా రవి, సంఘ నాయకులు పోతిన మహేష్, ఈది సాంబశివరావు, ఈది ఎల్లారాజారావు, పిళ్లా విజయ్, పిళ్లా రవి, మరుపిళ్ల దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

సంఘ విస్తృత కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడ్డూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నల్లాని సూర్యారావు, పిళ్లా శ్రీనివాసరావు, అరసవల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా పోతిన సురేష్, కోశాధికారిగా బాయన లోక పరమేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా పొట్నూరి వెంకటరమణ, మరుపిళ్ల శ్రీహరి, తమ్మిన సూర్యకుమారి తదితరులు ఎన్నికయ్యారు. 2023 - 2026 వరకూ ఈ కార్యవర్గం పని చేస్తుందని నాయకులు వివరించారు.

వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించండి



నీటి తొట్టెలను అందజేస్తున్న నిర్వాహకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించడానికి ప్రతి ఒక్కరూ వీధుల్లో, మేడలపై తొట్టెలు, డబ్బాలను ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఠాగూర్ పేర్కొన్నారు. జీవకారుణ్యం ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం జంతు ప్రేమికులకు నీటి తొట్టెల పంపిణీ కార్యక్రమం భవానీపురం ఐరన్ యార్డ్‌లోని కార్యాలయం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఠాగూర్, మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర, పశుసంవర్ధక శాఖ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు విచ్చేశారు. జంతు ప్రేమికులు వేసవిలో వాటికి నీటిని అందించేందుకు సిమెంటు తొట్టెలను అందచేయడం అభినందనీయమన్నారు. జీవకారుణ్యం చైర్మన్ మురాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి విజయవాడలోని పలు ప్రాంతాల నుంచి పలువురు జంతుప్రేమికులు నీటి తొట్టెలను అందుకున్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ విజయరత్నం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఒత్తిడిని జయించినప్పుడే విజయాలను సొంతం చేసుకోగలరని సైకాలజిస్ట్ విజయరత్నం అన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసు శాఖ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని పాదర్తి సుందరమ్మ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరత్నం మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదల వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతి చాలా కీలకమన్నారు. దీనిలో మంచి మార్కులను, జ్ఞానాన్ని సంపాదిస్తే అద్భుత విజయాలను అందుకోవచ్చన్నారు. పరీక్షల్లో ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. మరో సైకాలజిస్ట్ విజయలక్ష్మి మాట్లాడుతూ పది విద్యార్థులు చదువున్న అంశాలను ఎలా జ్ఞాపకం చేసుకోవాలో వివరించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి పలు ఉదాహరణలు చెప్పారు. జిల్లా అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



మంత్రి కారుమూరికి స్కూల్ జ్ఞాపికను అందజేస్తున్న స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న గౌతమ్ విద్యాసంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చిట్టినగర్ శ్రీ గౌతమ్ విద్యా సంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం శ్రీ మహాలక్ష్మి కల్యాణ మండపంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికార భాషా సంఘం, చైర్మన్ విజయ్‌బాబు విచ్చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం సరస్వతి దేవి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్కూల్ డైరెక్టర్ నల్లాని సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకలలో విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మంత్రి మాట్లాడుతున్న విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి తులసి, శ్రీరామ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయం చేయడంలోనే ఆనందం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):తోటి వారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ దామర్ల శ్రీశాంతి చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో ఆదివారం సాయంత్రం లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్ట్-316డి) చలసాని రీజియన్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీశాంతి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సమాజానికి సేవ చేయడంలో ముందుంటుందన్నారు. చలసాని రీజియన్‌లోని 18 క్లబ్‌ల్లో సభ్యులు చాలా సేవా కార్యక్రమాలను నిర్వహించారని కొనియాడారు. చలసాని రీజియన్ చైర్‌పర్సన్ చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ తమ రీజియన్ పరిధిలో నిర్వహించిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఫస్ట్ లేడి ఆఫ్ రీజియన్ సీహెచ్.దుర్గామణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చలసాని వెంకటరత్నం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల వెంకటేశ్వరరావు, కో-చైర్ పర్సన్ కంకణాల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ అంకాల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. రీజియన్‌లో ఉత్తమ సేవలు అందించిన క్లబ్ సభ్యులను అతిథులు సత్కరించారు. తొలుత యువతీ యువకులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాజు, మౌనిక, శృతి చేసిన యోగా నృత్యం అందరికి కళతాళనృత్యాలు అందుకుంది. ఆస్కార్ అవార్డు పొందిన నాటు నాటు పాటకు సాయినాథ్ బృందం స్టెప్పులు వేసి అలరించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న యువతి

కోటి రుద్రాక్ష అభిషేకానికి రూ.50 వేలు విరాళం



దాతలను సత్కరిస్తున్న గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో ఈనెల 28న చేయనున్న కోటి రుద్రాక్ష అభిషేకానికి ఆదివారం ఏపీ కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కె.బాలాజీ ప్రసాద్ రూ. 50 వేల విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షులు గౌతంరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ కోటి రుద్రాక్షాభిషేకం ఏర్పాటు చేశామన్నారు. దాత బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమంలో తాము భాగస్వామి అయ్యే అవకాశం రావటం ఆనందంగా ఉందన్నారు. అలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి బాబావారి శేషవస్త్రం చిత్రపటంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

వించిపేట(విజయవాడపశ్చిమ): తిరువూరులో ఆదివారం జరిగిన 'జగనన్న విద్యాదీవెన'కార్యక్రమానికి విచ్చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ మర్యాదపూర్వకంగా కలిసి తనను వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను అభినందించిన సీఎం.. వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేయడానికి కృషిచేయాలని సూచించారు.

తల్లిదండ్రులకు అండగా నిలవాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తమకు జీవితాన్ని ఇచ్చి, పెంచి పెద్ద చేసి ప్రయోజకులను చేసిన కన్న తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన బాధ్యత సమాజంలో అందరి పిల్లలపై ఉందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా అన్నారు. వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు ఆ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు వివక్షకు గురవుతున్నారని, వారి కుటుంబ సభ్యులే రోడ్లపై వదిలేయడం, ఆశ్రమాల్లో చేర్పించడం బాధాకరమన్నారు. ఏఎంసీ నాయకులు ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, షేక్ షాకీర్, షేక్ మస్తాన్, షేక్ రఫీ, మునీర్ అహ్మద్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు


పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: పోక్సో చట్టం, చిన్నారులపై లైంగిక వేధింపుల కేసులకు సంబంధించిన క్రమశిక్షణ కేసుల్లో సకాలంలో కఠిన చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఆర్జేడీలు, జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. 'పిల్లల లైంగిక వేధింపుల కేసుల్లో సస్పెండ్ అయిన ఉపాధ్యాయులను విచారణ, ఇతర క్రమశిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు తిరిగి విధుల్లోకి తీసుకోవద్దు' అని పేర్కొన్నారు. ఇలాంటి కేసుల్లో న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎస్‌వోపీలు, పోస్టర్లు, వీడియో మాడ్యూల్స్ తదితర వాటి ద్వారా పిల్లలకు అవగాహన సామర్థ్యం పెంపొందించాలని, 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్', ఎవరిని సంప్రదించాలి? అలాంటి సంఘటనలకు ఎలా ప్రతి స్పందించాలి? వంటి వాటిపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పోస్టర్లు, ఫిర్యాదు బాక్సు ఏర్పరచడం, పాఠశాలల్లో, పాఠశాల చుట్టు పక్కల ప్రదర్శించడం, అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహించాలని తెలిపారు.

త్రిశక్తి పీఠంలో దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఆదివారం శ్రీసరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది.

ఉచిత వైద్య సేవలు వినియోగించుకోండి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ రామలింగరాజు అన్నారు. దుర్గాపురం 19వ వార్డు సచివాలయం సమీపంలో ఆదివారం బీఆర్టీఎస్ వాకర్స్ క్లబ్, డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందజేయాలనే ఉద్దేశంతో ఉచిత వైద్యసేవలు అందించటం అభినందనీయమన్నారు. డాక్టర్ బండ్రెడ్డి గౌతమ్ సుమారు 300 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. బీపీ, షుగర్, లిపిడ్ ప్రొఫైల్ తదితర రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కేబినెట్ కార్యదర్శి పీవీడీ ప్రసాద్, కోశాధికారి సాయి బాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గుర్రం ఏడు కొండలు, ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, శ్యామ్, బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం జరిగిన జగనన్న విద్యాదీవెన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని హెలిప్యాడ్ వద్ద పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. –సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

మాతృప్రేమ.. అనంతం



గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం ప్రదానం చేస్తున్న కృష్ణకుమారి తదితరులు

విజయవాడ కల్చరల్: మాతృప్రేమ అనంతమైనదని దానికి పరిమితిలేదని ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. హాస్యానందం మాసపత్రిక దండెరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం సాహితీవేత్త జాంబవతి జ్ఞాపకార్థం గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం, హాస్యానందం మాసపత్రిక నిర్వహించిన కథల పోటీ విజేతలు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించింది. కృష్ణకుమారి మాట్లాడుతూ మాతృదేవోభ అన్న సూక్తిని నిజం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హాస్యానందం నిర్వాహకుడు రాము పండా సేవలను కొనియాడారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువ కథకులను, కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్న హాస్యానందం సంపాదక వర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బ్నిం, సీనియర్ చిత్రకారుడు ఏవీఎం, కార్టూన్ రంగానికి చెందిన కేవీవీ సత్యనారాయణ, దండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డీఎస్‌వీ రామశర్మ, డాక్టర్ వీవీ రాంకుమార్ పాల్గొన్నారు. అమ్మాయే నవ్వితే అంశంగా నిర్వహించిన కథల పోటీ విజేతలకు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతులను అందజేశారు.

గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోండి

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా



అవగాహన ప్రదర్శనలో ఖాదర్‌బాషా

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యాన ఆదివారం వించిపేట మహంతిపురంలో గంజాయి వినియోగంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో స్కూల్స్, కళాశాలల్లో విద్యార్థులు గంజాయికి బానిసలవుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి గంజాయి వినియోగంపై అవగాహన సభలు, సమావేశాలు నిర్వహించి యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నగర నాయకులు షేక్ అజాజ్, శివ, శంకర్, షేక్ బషీర్, సుబ్రహ్మణ్యం, ఎండీ మక్‌బుల్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో అనారోగ్య సమస్యలు దూరం



ఆర్థిక సహాయం అందుకున్న ఉత్తమ పేద విద్యార్థులతో వాకర్స్ ప్రతినిధులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నడకతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని వాకర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ఉత్తమ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. రవీంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు నేటి విద్యార్థులే పునాదని, ఉత్తమ విలువతో విద్యనభ్యసించి ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. నడకతో ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి 32ఏళ్ల క్రితం విశాఖ కేంద్రంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. లయన్స్, రోటరీ వంటి సేవా సంస్థలకు ధీటుగా సామాజిక సేవలో నడక సంఘాలు ముందున్నాయన్నారు. విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్ మాట్లాడతూ పర్యావరణ, ప్లాస్టిక్ నివారణ, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నడక-ఆరోగ్యం పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వాకర్స్ జిల్లా అధ్యక్షుడు రామలింగరాజు, వాకర్స్ ప్రతినిధులు సాంబిరెడ్డి, అమరనాథ్, ప్రసాద్, విశ్వేశ్వరరావు, చక్రధర్, చంద్రశేఖర్, రామకృష్ణ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

• నగరంలో బలగం



నగరంలోని ట్రెండ్ సెట్ మాల్‌లో ఆదివారం బలగం చిత్ర యూనిట్ సందడి చేసింది. దర్శకుడు వేణు, ప్రియదర్శి, కావ్యకల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు. -సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ